

నేడు ఐటీఐలో అప్రెంటీస్ మేళా

సంగారెడ్డి అర్బన్, జూలై 7 : సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఐటీఐ వివిధ విభాగాల్లో ఉత్తీర్ణులైనవారు మేళాలో పాల్గొనేందుకు అర్హులని, ఆసక్తి కలిగినవారు సంబంధిత వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్ఎస్సీ, ఐటీఐ సర్టిఫికెట్లతో ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ సదావకాశాన్ని వినియోగించాలని ఆయన కోరారు.

కొత్త చట్టాలతో సత్వర న్యాయం

- ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- సైబర్ నేరాలపై విస్తృత ప్రచారం
- దొంగతనాలపై 24/7 పోలీసుల నిఘా
- సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్



సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్

సంగారెడ్డి క్రైం, జూలై 7 : దేశవ్యాప్తంగా అమలు లోకి వచ్చిన నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతుల్లో అనేక మార్పులు వచ్చాయని సంగారెడ్డి డీఎస్పీ ఎ.సత్తయ్యగౌడ్ పేర్కొన్నారు. నూతన చట్టాలు, సంగారెడ్డి డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. భారత ప్రభుత్వం కొత్తగా అమలులోకి తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం-2023పై పోలీసులకు పూర్తి అవగాహన ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని అన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ కొత్త చట్టాలను నేర్చుకోవాలని సూచించారు. కొత్త చట్టాల అమలు జరిగిన వెంటనే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమని అన్నారు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, అరెస్ట్, వాంగ్మూలం నమోదులో పాటించాల్సిన జాగ్రత్తలు, చార్జ్‌షీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించాల్సిన తీరుపై ఇప్పటికే డివిజన్ పరిధిలోని పోలీసులకు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కొత్త చట్టంలో వచ్చిన జీరో ఎఫ్ఐఆర్ వల్ల బాధితులకు సత్వర, తక్షణ న్యాయం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి

సంగారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యపై, తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించినట్టు ఆయన తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గ్రంథాలయం వరకు బోలార్డ్స్ ఏర్పాటు చేశామన్నారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి హైదరాబాద్ బస్టాప్ వరకు బోలార్డ్స్ ఏర్పాటు చేసి ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడంతో పాటు కంది చౌరస్తాలో తరచూ ట్రాఫిక్ జామ్‌ను నియంత్రించడానికి యుటర్న్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానాలతో పాటు జైలు శిక్షలు కూడా అమలు చేస్తున్నట్టు వివరించారు. దుకాణాల యజమానులు తమ షాప్‌లను వెనక్కి జరుపుకోవాలని, షాప్‌లకు వచ్చేవారు వాహనాలను రోడ్లపై పెట్టకుండా చూసుకోవాలని సూచించినట్లు చెప్పారు. డివిజన్‌లో దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు సత్తయ్యగౌడ్ తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు, 24/7 పెట్రోలింగ్ తదితర చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఆన్‌లైన్‌లో సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో సంగారెడ్డి డివిజన్ పరిధిలో కళాబృందాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడంతో పాటు సోషల్ మీడియా ద్వారా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. సైబర్ నేరగాళ్ల బారినపడి మోసపోతే వెంటనే 1930, 155260 లేదా 100కు ఫోన్ చేయాలన్నారు. లేదా, ఎన్‌సీఆర్పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే డబ్బు పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బును రికవరీ చేయడానికి వీలుంటుందన్నారు.

నాటు సాగేదెలా..

అదును దాటుతున్నా.. కరుణించని వరుణుడు



- అన్నదాత ఎదురుచూపులు
- తగ్గిన భూగర్భజలాలు
- ప్రాజెక్టుల్లోనూ అంతంతే
- మెదక్ జిల్లాలో నాట్లు 3 శాతమే

వరి సాగు అంచనా 3.27 లక్షల ఎకరాలు

మెదక్, జూలై 6: వానాకాలం సీజన్ నెల గడిచినా వర్షాలు సమృద్ధిగా కురియకపోవడంతో రైతులు వరి నాట్లు వేసుకోవడానికి ముందుకురావడం లేదు. ఈ సీజన్‌లో మెదక్ జిల్లాలో ఇప్పటివరకూ పెద్ద వర్షం పడలేదు. బోర్లు లేని చోట రైతులు నారు మడులను రక్షించుకోవడానికి బిందెలతో నీరు తెచ్చి పోస్తున్నారు. నారు మడులు ముదిరిపోతున్నా వర్షాభావ పరిస్థితులతో నాట్లు వేయడానికి రైతులు సాహసించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు వరి నాట్లు 3 శాతం మించ లేదు. వ్యవసాయశాఖ ప్రణాళిక ప్రకారం జిల్లాలో 3.73 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేస్తారని అంచనావేశారు. ఇందులో అత్యధికంగా 3.27 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తారని అంచనా. కానీ ఇప్పటివరకు 4 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి.

తగ్గిన భూగర్భ జలాలు

ఈసారి వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో భూగర్భ జలాలు తగ్గిపోయాయి. గత సంవత్సరం భూగర్భ జలాలు 12.53 మీటర్లు కాగా.. ఈసారి 13.79 మీటర్లకు తగ్గినట్టు జిల్లా భూగర్భజలశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో 75 శాతం రైతులు బోర్లపైనే ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదైంది. ఆరుతడి పంటల విత్తనం మాత్రమే వేసుకున్నారు. వరినాట్ల గురించి ఆలోచించే ధైర్యం చేయడం లేదు. బోర్ల కింద ఉన్న భూముల్లో మాత్రమే నారుమళ్లు పోసుకున్నారు. ప్రాజెక్టులు, చెరువులు, కాలువల కింద వ్యవసాయ పనులు ఇంకా మొదలుపెట్ట లేదు.

సింగూరు ప్రాజెక్టుపైనే ఆశలు

మెదక్ జిల్లాకు ప్రధాన ఆధారం ఘనపురం ఆనకట్ట. మంజీర నదిపై సంగారెడ్డి జిల్లాలో నిర్మించిన సింగూరు జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 30 టీఎంసీలు కాగా, ఇప్పుడు 13 టీఎంసీలు మాత్రమే నీరుంది. సింగూరు నుంచి నీరు వదిలితేనే ఘనపురం ఆనకట్టకు నీరు చేరుతుంది. ఘనపురం ఆయకట్టులో 25 వేల ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేసుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. కాల్వల పరీవాహక ప్రాంతంలో రైతులు బోర్లు ఉన్నా ఘనపురం ఆనకట్ట నుంచి నీళ్లు వదిలితేనే పంటలు వేసుకోవడం సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో రైతులు వరి నాట్లు వేసుకోవడానికి వరుణుడి కరుణపై ఆధారపడ్డారు.

అసలే వర్షాభావం.. ఆపై ఖర్చు భారం

నారాయణఖేడ్, జూలై 6: వానాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఒక్క పెద్ద వాన కూడా పడకపోవడంతో విత్తనం వేసుకోవడం వెనుబడుతున్నది. కురిసిన కొద్దిపాటి వర్షానికి వేసుకున్న విత్తనాలు మొలకెత్తగా.. కలుపు తీయించడానికి కూలీలు దొరక్క రైతులు ఇబ్బందిపడుతున్నారు. వానాకాలం ప్రారంభమైనప్పటి నుంచి మేఘాలు కమ్ముకుంటున్నప్పటికీ వర్షాలు నామమాత్రంగానే కురుస్తున్నాయి. సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విత్తనం వేసుకోవడమే ఇంకా పూర్తికాలేదు. వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా కంది పంట 65వేల ఎకరాల్లో సాగు చేస్తారనుకుంటే ఇప్పటి వరకు 42 వేల ఎకరాల్లో మాత్రమే విత్తనం వేసుకున్నారు. మినుము 21,877 ఎకరాలకు.. 4,473 ఎకరాలు, సోయా 60,212 ఎకరాలకు.. 41 వేల ఎకరాలు, జొన్న పంట 10,894 ఎకరాలకు.. 91 ఎకరాలు, మొక్కజొన్న 30,058 ఎకరాలకు 3,602 ఎకరాల్లో మాత్రమే విత్తుకున్నారు. పత్తి విత్తనం మాత్రం అంచనాలో సగం వేసుకున్నారు. అడపాదడపా కురిసిన వర్షాలకు విత్తనం మొలకెత్తినప్పటికీ వాడిపోతున్నాయి. జిల్లాలో 25 మండలాలు ఉండగా.. కంగ్టి, కల్హేర్, నారాయణఖేడ్, ఆందోల్, జహీరాబాద్, గుమ్మడిదల, నిజాంపేట మండలాల్లో సాధారణ వర్షపాతానికి కంటే తక్కువగా కురిసింది.

కలుపుతీతకు కూలీల కొరత

అడపాదడప కురిసిన వర్షానికి విత్తనం మొలకెత్తినా కలుపు విపరీతంగా పెరిగింది. నారాయణఖేడ్ డివిజన్‌లోని పలు మండలాల్లో రైతులు పొరుగునే ఉన్న కర్ణాటక నుంచి కూలీలను పిలిపిస్తున్నారు. డిమాండ్ పెరగడంతో కూలి రేట్లు కూడా పెంచేశారు. గతంలో ఒక ఎకరంలో కలుపు తీయడానికి రూ.2 వేలు చెల్లించగా.. ప్రస్తుతం రూ.3,500 వేల నుంచి రూ. 5వేల వరకు డిమాండ్ చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. దీంతో పెట్టుబడి భారం పెరిగిపోయిందని రైతులు వాపోతున్నారు.



నారాయణఖేడ్‌లో కలుపు తీస్తున్న కర్ణాటక కూలీలు

గిట్టుబాటు కావడం లేదు



కూలి పెరిగినా గిట్టుబాటు కావడం లేదు. ఎకరా విస్తీర్ణంలో కలుపు తీయడానికి 10-12 మంది అవసరమవుతుంది. ఒక్కొరికి రూ.400 నుంచి రూ. 500 మాత్రమే లభిస్తుందన్నది. పెరిగిన ధరలకు ఈ మొత్తం సరిపోవడం లేదు. మార్కెట్‌లో కిలో కూరగాయలు రూ. 100 పలుకుతున్నాయి. ప్రతీ నిత్యావసర వస్తువు ధరలు పెరిగిపోయాయి. కూలి రేటు పెంచినా మాకు ఏమీ మిగలడం లేదు.

- కమలాబాయి, కర్ణాటక కూలి

ఓడీఎఫ్‌ను సందర్శిస్తా

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల వినతి

సంగారెడ్డి అర్బన్, జూలై 7 : ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో ఓడీఎఫ్‌ను సందర్శించి పరిష్కారానికి కృషి చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మజ్దూర్ సంఘ్(ఓఎఫ్ఎంఎస్)ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆదివారం హైదరాబాద్‌లో ఎంపీ రఘునందన్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి వర్క్‌లోడ్‌షాటేజ్, ఇతర సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ మాట్లాడుతూ ఓడీఎఫ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో యూనియన్ నాయకులు, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.



మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఓఎఫ్ఎంఎస్ నాయకులు

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగావకాశాలు

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జులై 7 : ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఇంటర్ విద్యార్హతతో ఉద్యోగావకాశాలు ఉన్నాయని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదివారం ప్రకటనలో తెలిపారు. 2004 జులై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించిన అవివాహిత మహిళలు, పురుషులు ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. అసక్తి, అర్హతలు కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం (హెచ్‌టీటీపీఎస్-అగ్నిపథ్‌వాయు.సీడీఏసీ.ఇన్)లో సంప్రదించాలని ఆమె కోరారు.

కుళ్లిన కూరగాయలు, పాడైన సరుకులు

నాణ్యతకు తిలోదకాలు!

- అడ్డగోలుగా ఆహార కల్తీ.. కాలం చెల్లిన ఉత్పత్తుల వాడకం
- ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో వెలుగులోకి..

సంగారెడ్డి అర్బన్, జూలై 7 : అడ్డగోలు ఆహార కల్తీ.. నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లు.. హాస్టల్ మెస్‌లు, బేకరీలు సంగారెడ్డి జిల్లా ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నాయి. అపరిశుభ్రమైన వంట గదులు, కుళ్లిన కూరగాయలు, నిల్వ ఉంచిన మాంసం, కాలం చెల్లిన సరుకులు, మసాలాలు, మళ్లీ మళ్లీ వాడిన నూనెలు.. వ్యాధులను ఆహ్వానిస్తున్నాయి. తిన్నోళ్లకు.. తిన్నంత అనారోగ్యం అన్నట్టు ఉంది పరిస్థితి. ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఆకర్షణీయమైన హంగులతో కట్టిపడేసే హోటళ్లలో వాస్తవ పరిస్థితులు అధికారుల ఆకస్మిక తనిఖీల్లో బయటపడ్డాయి.

ప్రజారోగ్యంతో చెలగాటం

కల్తీ ఆహారం తీసుకుంటే రోగాలబారినపడతారని బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌తో డయేరియా, విరేచనాలు, కడుపునొప్పి, ఎసిడిటీ వంటివి వస్తాయి. వాడిన నూనెలను మళ్లీ వాడడం, ఫుడ్ కలర్ల వినియోగంతో క్యాన్సర్, నిల్వ ఉంచిన ఆహారంతో కాలేయ సమస్యలు, హెపటైటీస్ వంటి తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పాటించే ప్రమాణాలు మూడు కేటగిరీలుగా విభజిస్తారు. హానికరమైనవి, నకిలీవి, నాసికరమైనవి. ఇందులో ఏ ఒక్కటి పాటించకుంటే ఇక అంతే సంగతి. ఫుడ్ సేఫ్టీ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం ఆహార ప్రమాణాల సూచికలో తెలంగాణ 15వ స్థానంలో ఉందంటే నాణ్యతా ప్రమాణాలు ఏ మేరకు ఉందో అంచనా వేసుకోక తప్పదు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్, జిల్లా అధికారి ఒక్కరే

సంగారెడ్డి జిల్లాలో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక జిల్లా అధికారి విధులు నిర్వహించాల్సి ఉన్నా.. ప్రస్తుతం ఒకరే రెండు బాధ్యతలు చూస్తున్నారు. ఇవేకాకుండా ఆయన సిద్దిపేట జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ (జీఎఫ్ఐ)గా, మేడ్చల్ జిల్లాకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ (ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్-ఎఫ్ఐ)గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు హైదరాబాద్‌లో ఆహార నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్‌లోనూ ఈయన సభ్యులుగా ఉన్నారు. దీంతో ఒక్కరిపైనే పనిభారం పడడంతో పాటు అదనపు బాధ్యతలతో ఆయన పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏళ్లుగా ఏర్పడిన సిబ్బంది కొరతతో ఫిర్యాదు వస్తే తప్పా రొటీన్ తనిఖీలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఏదేమైనా జిల్లాలో కల్తీ ఫుడ్ నియంత్రణ, నాణ్యత ప్రమాణాల మెరుగుకు అధికారులను నియమించడంతో పాటు మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది.



సంగారెడ్డి ఫసల్‌వాదిలో ఓ హాస్టల్‌లో వస్తువులను పరిశీలిస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ధర్మేందర్

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ప్రతీ ఒక్కరు పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేస్తాం. ఆహార విక్రయదారులు పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. కల్తీ ఆహారం విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

-ధర్మేందర్, జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారి, సంగారెడ్డి

తనిఖీల్లో వెలుగు చూసిన అంశాలు

నెల రోజులుగా సంగారెడ్డి జిల్లాలో జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారి ధర్మేందర్ నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పలు అంశాలు వెలుగుచూశాయి.

- సంగారెడ్డి పట్టణంలో గత నెల 19న ఓ బావార్చి రెస్టారెంట్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు చేపట్టిన తనిఖీల్లో పలు విషయాలు వెలుగుచూశాయి. అపరిశుభ్రమైన కిచెన్, వెజ్, నాన్‌వెజ్ పదార్థాలు ఒకే ఫ్రీజర్‌లో నిల్వ చేశారు. కూరగాయలు కుళ్లిపోయాయి. బేకరీలో ఆహార పదార్థాలు అపరిశుభ్రంగా పడివుండడాన్ని గుర్తించారు. లేబుల్ లేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.
- ఓ ప్రముఖ బేకరీలో నిర్వహించిన తనిఖీల్లో గడువు ముగిసిన మష్రూమ్, స్ట్రాబెర్రీలను గుర్తించారు. గత నెల 20న ఫసల్‌వాది శివారులోని ఎంఎన్ఆర్ విద్యాసంస్థ సమీపంలోని ప్రైవేట్ హాస్టళ్లు, మెస్‌లల్లో ఫుడ్‌సేఫ్టీ అధికార బృందం తనిఖీలు చేయగా మైదా పిండిలో లక్కపురుగులు, వంట గది అపరిశుభ్రం, కూరగాయలు నిల్వచేసే ప్రదేశంలో సాలె పురుగులు, ఫంగస్ సోకిన ఉల్లిపాయలు, ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్ లేని కారణంగా నోటీసులు జారీచేసి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- గత నెల 27న రుద్రారంలోని ఓ ప్రముఖ జూనియర్ కళాశాల క్యాంటిన్‌ను ఆకస్మిక తనిఖీ చేయగా 50 కిలోల ఇడ్లీ రవ్వ గడువు ముగియడాన్ని గుర్తించారు.
- గత నెల 28వ తేదీన సుల్తాన్‌పూర్‌లోని ఓ విద్యాసంస్థ హాస్టల్‌ను ఎఫ్ఎస్ఎస్ఏఐ బృందం, ఫుడ్‌సేఫ్టీ ఫ్లయింగ్ స్క్వాడ్, మొబైల్ ప్రయోగశాల ద్వారా ఆకస్మిక తనిఖీలు చేపట్టగా స్టోర్ రూమ్‌లో ఎలుకలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. కూరగాయలు కోసే ప్రాంతం అత్యంత అపరిశుభ్రంగా కంపు కొడుతున్నది. వాటర్ అనాలసిస్ రిపోర్టులు లేకపోవడం, ముడిసరుకులు నాసిరకంగా ఉండడాన్ని గమనించి నోటీసులు జారీ చేసి పలు నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు.
- ఈ నెల 1వ తేదీన ఫసల్‌వాది శివారులోని ఓ విద్యాసంస్థ మెస్‌లోనూ నిబంధనలు పాటించకపోవడంతో నోటీసులు జారీ చేసి పలు నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు.
- పలు పరిశ్రమల మెస్‌లు, ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్ల మెస్‌లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, పలు విద్యాసంస్థల హాస్టల్ మెస్‌లు తనిఖీల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్రత, గడువు ముగిసిన వస్తువుల వాడకం, నాణ్యత ప్రమాణాల లేమి స్పష్టంగా కనిపించిందని ఆ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఈ తనిఖీల్లో ఇప్పటి వరకు 14 నోటీసులు జారీ చేసినట్టు ఆ శాఖ అధికారి ధర్మేందర్ తెలిపారు.

అట్టహాసంగా జగ్గారెడ్డి జన్మదిన వేడుకలు

- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు
- డప్పు చప్పుళ్లు, డీజే, టపాసులతో హోరెత్తిన జిల్లా కేంద్రం
- ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మండలాలవారీగా కేకులు కట్ చేసిన జగ్గారెడ్డి



సంగారెడ్డి పట్టణంలోని గెస్ట్‌హౌస్‌లో కేక్ కట్ చేస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జులై 7: సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ఆయన కూతురు జయారెడ్డి (కూతురు)ల జన్మదిన వేడుకలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన వేడుకలకు కాంగ్రెస్ కార్యకర్తలు, జగ్గారెడ్డి అభిమానులు భారీగా తరలివచ్చారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద నుంచి ఐబీ వరకు వందలాది మంది కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పొడవున ప్రధాన కూడళ్ల వద్ద కార్యకర్తలు, అభిమానులు జగ్గారెడ్డిని శాలువాలు, పూలమాలలు, గజమాలలతో ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జగ్గారెడ్డి బర్త్ డే సందర్భంగా డప్పు చప్పుళ్లు, డీజే పాటలు, టపాసుల పేలుళ్లతో జిల్లా కేంద్రం హోరెత్తింది. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు జగ్గారెడ్డిని సన్మానించి, భారీ కేకులను కట్ చేయించారు. సంగారెడ్డి, కొండాపూర్, కంది, సదాశివపేట మండలాలతో పాటుగా సంగారెడ్డి, సదాశివపేట పట్టణాలవారీగా వేర్వేరుగా ఏర్పాటు చేసిన వేదికలపై కేకులు కట్ చేశారు. అనంతరం పట్టణంలోని నాల్‌సాబ్‌గడ్డ మదీనా చౌరస్తా వద్ద కౌన్సిలర్ షఫీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగ్గారెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు, టీఎస్ఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవి, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, టీపీసీసీ కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, మాజీ ఎంపీపీ జూలకంటి అంజనేయులు, కాంగ్రెస్ నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేశ్, కిరణ్‌గౌడ్, తాళ్లపల్లి ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్‌గౌడ్, బుచ్చిరాములు, జార్జ్ మాథ్యూ, విజయభాస్కర్, కసిని రాజు తదితరులు పాల్గొన్నారు.



జగ్గారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ప్రతీ సోమవారం సంగారెడ్డిలోనే ఉంటా

ప్రతీ సోమవారం తాను సంగారెడ్డిలోనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో తన జన్మదిన వేడుకల్లో ఆయన కార్యకర్తలు, అభిమానులనుద్దేశించి మాట్లాడారు. వచ్చే రెండు నెలల వరకు వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉంటానని తెలిపారు. పనులు పూర్తికాగానే ప్రతీ సోమవారం సంగారెడ్డిలో అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజలు, కార్యకర్తలు, అభిమానుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తానన్నారు. తన కోసం అనవసరంగా హైదరాబాద్ ఎవరు రావద్దని తెలిపారు. ఒక వేళ వచ్చిన తాను ఎవరితో మాట్లాడబోనని, మీరు హైదరాబాద్ వచ్చి నన్ను ఇబ్బంది పెట్టవద్దు..మీరు ఇబ్బంది పడవద్దని హితవు పలికారు. ఈ రెండు నెలల పాటు డబ్బులు సంపాదించి, అప్పులు తీర్చాల్సిన బాధ్యత తనపై ఉన్నదని, అలాగే, సంగారెడ్డిలో నిర్వహించే పండుగల కోసం డబ్బు సంపాదించాలనే ప్రణాళిక పెట్టుకున్నానన్నారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టించవద్దని, ప్రతీ రోజు రాత్రి 12 గంటలకు దాబాలను మూసివేయించాలని పోలీసులకు చెప్పానని తెలిపారు. తాను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నానని తెలిపారు. దైవ సాక్షిగా చెబుతున్న తాను మాత్రం ప్రశాంతంగా ఉన్నానని, ఓడిపోయిన జవాబుదారి తనంతో ప్రజా సమస్యలు తీరుస్తానని జగ్గారెడ్డి తెలిపారు.

అసంపూర్తిగా పాఠశాలల అదనపు గదుల నిర్మాణం

- గత ప్రభుత్వంలో 'మన ఊరు-మనబడి' కింద పనులు
- బిల్లులు రాలేదని మధ్యలోనే ఆపిన కాంట్రాక్టర్లు
- పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల వేడుకోలు





నారాయణపూర్‌లో పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణం, మధ్యలోనే నిలిచిపోయిన మూత్రశాలల గదులు

నర్సాపూర్, జూలై 7: గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా 'మనఊరు-మన బడి' కింద పాఠశాలలకు నిధులు కేటాయించి పనులు చేపట్టింది. అయితే సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పాటు అధికారుల అలసత్వం కారణంగా మధ్యలోనే నిలిచిపోయాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నారాయణపూర్ ప్రాథమిక పాఠశాలలో సుమారు వందమంది వరకు విద్యార్థులు ఉంటారు. వారికి తగ్గట్టు గదులు లేకపోవడంతో గత ప్రభుత్వంలో రెండు అదనపు గదులతో పాటు మూత్రశాలల నిర్మాణం చేపట్టారు. మూత్రశాలల పనులు చివరిదశలో నిలిచిపోగా.. అదనపు తరగతి గదుల నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిపేశారు. అదేవిధంగా మండలంలోని ఎల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో కూడా రెండు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. పనులు చివరిదశలో నిలిపివేయడంతో అసంపూర్తిగా ఉండిపోయాయి. రూ.లక్షలు వెచ్చించిన పనులు మధ్యలోనే నిలిపేయడంతో ప్రజాధనం వృథా అవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సరైన గదులు లేకపోవడంతో ఇరుకు గదుల్లో విద్యార్థులు చదువుతూ అవస్థలు పడుతున్నారు.

అరకొర గదిలోనే పంచాయతీ కార్యాలయం!

ఎల్లాపూర్‌లో అదనపు గదుల నిర్మాణం పూర్తికాకపోవడంతో అరకొర గదుల్లో ఇబ్బందులు పడుతుంటే.. పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో పాఠశాలలోనే ఉన్న గదిని పంచాయతీ కార్యాలయంగా వాడుకుంటుండడం విశేషం. 'మనఊరు-మనబడి' కింద పాఠశాలలో అదనపు గదుల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని అధికారులు హడావుడి చేశారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా.. వాటి గురించి పట్టించుకునే నాథుడే లేడు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా వదిలేసిన పనులను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

తల్లి మరణం తట్టుకోలేక కొడుకు బలవన్మరణం



బాలమల్లు (ఫైల్)

మర్కుక్, జూలై 7: తల్లి మరణంతో మనోవేదనకు గురైన కొడుకు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మర్కుక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రవల్లి గ్రామానికి చెందిన మల్లని నర్సమ్మ(60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మూడునెలల క్రితం చనిపోయింది. తల్లి మృతిని జీర్ణించుకోలేక మనోవేదనతో నర్సమ్మ కొడుకు బాలమల్లు(36) శనివారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే గజ్వేల్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. తల్లి మల్లమ్మ మృతిని తట్టుకోలేకనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తన కొడుకు మరణంపై ఎటువంటి అనుమానం లేదని, బాలమల్లు తండ్రి నర్సయ్య ఫిర్యాదు చేసినట్లు మర్కుక్ ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతుని స్వగ్రామం ఎర్రవల్లిలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ మొండి భాగ్య బిక్షపతి, గ్రామ నాయకులు వెంకట్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, శ్రీశైలం బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దళితుల హక్కుల సాధనకు పోరాటాలు: కేవీపీఎస్

సంగారెడ్డి రూరల్, జూలై 7: పోరాటాల ద్వారానే దళితుల హక్కులను సాధిస్తామని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా దళితులపై పెద్దఎత్తున దాడులు జరుగుతూనే ఉన్నాయని, దాడులు చేస్తున్న వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. దళితులకు రక్షణ చట్టాలుగా ఉన్నా అగ్రవర్ణ పెత్తందారులకే చుట్టాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ రక్షణ కోసం, రిజర్వేషన్ల అమలుకు, విద్యా, వైద్యం కోసం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం భవిష్యత్తులో ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదన్నారు.



శిక్షణ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యం



పటాన్‌చెరు మహంకాళీ ఆలయం వద్ద కార్యకర్తల పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

సమస్యల పరిష్కారానికి రాజీలేని కృషి

పటాన్‌చెరు, జూలై 7: మెదక్ జిల్లా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎంపీ రఘునందన్‌రావు స్పష్టం చేశారు. బీజేపీ యువ నాయకుడు రాచమల్ల సంతోష్‌గౌడ్ నేతృత్వంలో 11 మంది బీజేపీ కార్యకర్తలు రఘునందన్‌రావు విజయానికి మొక్కులు తీర్చుకోవడంలో భాగంగా ఆదివారం పటాన్‌చెరు మహంకాళీ అమ్మవారి ఆలయం నుంచి విజయవాడ కనకదుర్గ ఆలయం వరకు చేపడుతున్న పాదయాత్రను ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. పటాన్‌చెరు నియోజకవర్గ సమస్యలతో పాటు మెదక్ జిల్లా సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మహంకాళీ ఆలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, మాజీ కార్పొరేటర్ సపానాదేవ్, నాయకులు ప్రకాష్‌రావు తదితరులు ఘనంగా సన్మానించి, అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

నేటి నుంచి తారా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

సంగారెడ్డి అర్బన్, జూలై 7: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేటి నుంచి డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభంకానున్నాయని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. దోస్త్ మూడో ఫేస్‌లో అడ్మిషన్లు వచ్చిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకుంటే వారి సీటు ఉంటుందన్నారు. మూడో ఫేస్‌లో అడ్మిషన్ వచ్చినవారు 11వరకు మొదట సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని సూచించారు. మొదట, రెండో, మూడో ఫేస్‌లో సీటు వచ్చి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకున్న విద్యార్థులు సీసీఈ ఓటీపీ వచ్చిన తర్వాత 12 వరకు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో కళాశాలకు వచ్చి అడ్మిషన్లు పొందాలని సూచించారు. ఇతర వివరాలకు 9989942298, 7989239115 నంబర్లకు ఫోన్ చేయాలని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ సూచించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

శివ్వంపేట, జూలై 7: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొంతాన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన అరికెల రమేష్ భార్య పుష్ప ఈనెల 6న ఉదయం 9 గంటలకు కూలీకి వెళ్లింది. భర్త రమేష్, కూతురు అక్షయ ఇంట్లోనే ఉన్నారు. కూలీ పనులను ముగించుకొని పుష్ప సాయంత్రం 7 గంటలకు ఇంటికి వచ్చింది. భర్త కనిపించకపోవడంతో కూతురు అక్షయను అడగ్గా బయటకు వెళ్లాడని చెప్పింది. రాత్రి 9 అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం ఉదయం 5 గంటలకు ఇంటి ఎదుట గుడిసెలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శివ్వంపేట, జూలై 7: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం చిన్నగొట్టిముక్ల గ్రామంలో చోటుచేసుకున్నది. శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామంలోని కుమ్మరివాని కుంట వద్ద పూర్తిగా కుళ్లిపోయిన మృతదేహం కనిపించడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన తూప్రాన్ సీఐ రంగకృష్ణ, ఎస్‌ఐ మైపాల్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 15 రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని, మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టని స్థితిలో ఉన్నదన్నారు. మృతుడి పాయింట్ జేబులో ఫోన్ లభించిందని, అయితే వర్షానికి తడిసిపోవడంతో సిమ్ పనిచేయడం లేదన్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉన్నదని సీఐ తెలిపారు.

వర్షాల కోసం ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



మునిగేపల్లి పటేల్‌చెరువు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కల్హేర్, జూలై 7: వర్షాకాలం ప్రారంభమై నెలరోజులకు ఎక్కువ కావస్తున్నా.. వర్షాలు కురియకపోవడంతో ప్రజలు వరుణదేవుడు, తమ మతాలకు చెందిన దేవుళ్లపై ఆధారపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం మునిగేపల్లి గ్రామ శివారులోని పటేల్ చెరువు వద్ద గ్రామానికి చెందిన ముస్లింలు పేషిమామ్ సఫియోద్దీన్, మైనార్టీ మండల నాయకులు నవాబ్‌పటేల్ ఆధ్వర్యంలో వర్షాలు కురిపించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నమాజు చదివి వర్షాలు కురిపించి, రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలీమ్ సాబ్ అబ్దుల్ వాహబ్, ఎండీ ఇద్రీస్, ఇసాఖ్ పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్న పోలీసులను దూషించిన వైద్యులు

- ఓ జర్నలిస్టుపై దాడికి యత్నం

మెదక్ అర్బన్, జూలై 7: బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడమే కాక.. తాగొద్దన్నందుకు ఓ ఇద్దరు వైద్యులు పోలీసులను బండ బూతులు తిట్టారు. ఈ ఘటన ఆదివారం పట్టణంలోని గాంధీనగర్ శివారులో జరిగింది. సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన ఓ ప్రభుత్వ వైద్యుడు, మెదక్ ప్రాంతానికి చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఓ డాక్టర్‌తో పాటు మరో ఇద్దరు కలిసి గాంధీనగర్ శివారులోని బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగొద్దని అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. మీ కానిస్టేబుళ్లతో మాట్లాడేది లేదని, పోలీసు అధికారులతోనే మాట్లాడుతామని, మాకు పెద్ద పెద్ద వాళ్లు తెలుసంటూ దూషించారు. అంతేకాకుండా పోలీసులతో వాగ్వాదం జరుగుతుండగా.. విషయం గమనించిన ఓ జర్నలిస్టు అక్కడికి వెళ్లగా అతనిని బైక్‌పై నుంచి లాగేశారు. వారిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

28 నుంచి ఉజ్జయిని మహంకాళీ జాతర

తూప్రాన్, జూలై 7: తూప్రాన్ పట్టణంలోని శ్రీఉజ్జయిని మహంకాళీ ఉత్సవాలు 28 నుంచి నిర్వహించడానికి పురప్రముఖులు నిర్ణయించారు. పట్టణంలోని ఉజ్జయిని మహంకాళీ ఆలయ ఆవరణలో ఆదివారం ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 28న బండ్లు, బోనాలు, 29న గావురంగాలు, 30న బొరమ్మ పూజలు నిర్వహించడానికి నిర్ణయించారు. ఉదయ్‌కుమార్‌శర్మ ఉత్సవాల తేదీలు ఖరారు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ మామిండ్ల జ్యోతికృష్ణ, వైస్ ఛైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, పురప్రముఖులు పాల్గొన్నారు.

ఐలాపూర్ రైతులకు న్యాయం చేయాలి

- దశాబ్దాలుగా న్యాయపోరాటంతో చితికిపోయాం
- కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు కావడం లేదు
- న్యాయం చేయాలని బాధితుల ఆవేదన

పటాన్‌చెరు, జూలై 7: దశాబ్దాల తరబడి పోరాటం చేస్తున్నా న్యాయంగా దక్కాల్సిన తమ భూములు దక్కడం లేదని అమీన్‌పూర్ మండలం ఐలాపూర్, ఐలాపూర్ తండాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ఐలాపూర్ భూముల కథనంపై గ్రామ భూ బాధితులు, రైతులు స్పందించారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా గ్రామంలోని మొత్తం భూమిని వివాదాస్పదం చేయడంతో మొత్తం 1263.21 ఎకరాల భూమి వివాదాస్పదమైంది. కాగా 1982లోనే సంగారెడ్డి జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు జాయింట్ కలెక్టర్ రైతుల పేరుమీద సేత్వార్ జారీచేశారని వారు తెలిపారు. అప్పటి నుంచి పహానీలలో తమ పేర్లు వస్తున్నాయని, పాసు పుస్తకాలు సైతం జారీ అయ్యాయని పేర్కొన్నారు. పట్టా రైతులతో పాటు గతంలో ఆయా ప్రభుత్వాలు ఇచ్చిన అసైన్డ్ పట్టాదారులు సైతం తమ భూములను సాగుచేసుకునే అవకాశం ఇవ్వకుండా కొందరు ప్రైవేటు వ్యక్తులు అడ్డుపడుతున్నారని విమర్శించారు. దశాబ్దాల తరబడి భూములను సాగు చేసుకుంటున్న వారిని సైతం పట్టాదారులు కాదని ప్రచారం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఐలాపూర్, ఐలాపూర్ తండాల్లో ఉండే గిరిజన, బలహీనవర్గాలు, మైనార్టీల భూములను స్వాధీనం చేసుకునే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఐలాపూర్ భూబాధితులు, రైతుల పక్షాన న్యాయపోరాటం చేస్తున్న గ్రామానికి చెందిన రైతు ఎంఏ.ముఖీం మాట్లాడుతూ గతంలో రైతులను ఇబ్బందులకు గురిచేసేందుకు హైకోర్టులో 2005లో వేసిన 18845, 11993, 18793 రిట్ పిటిషన్లను సుదీర్ఘ విచారణల తరువాత న్యాయస్థానం కొట్టివేసిందని పేర్కొన్నారు. అయినా ఐలాపూర్ భూములపై కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దశాబ్దాల తరబడి రెండు గ్రామాల రైతులు, నిజమైన పట్టాదారులకు దక్కాల్సిన భూములను దక్కకుండా చేసేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను సాగనివ్వమన్నారు. తాజాగా సర్వే నెంబర్ 119లో 19.27 ఎకరాల భూమికి నిజమైన పట్టాదారులుగా ఉన్న రైతులకు అనుకూలంగా ఎవరు ఉన్నా ఇబ్బందులకు గురిచేయొద్దని ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. కోర్టు ఆదేశాలు సైతం లెక్కచేయకుండా కొందరు నాయకులు, దళారుల ప్రోద్బలంతో రెవెన్యూ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 1987లోనే సర్వేనెంబర్ 119లో భూములను మార్పిడి చేసి రెసిడెన్షియల్ జోన్లుగా అప్పటి ప్రభుత్వమే మార్చిందన్నారు. పట్టా భూములుగా గుర్తించి భూ మార్పిడి చేసిన భూములు ఎలా వివాదాస్పదం అవుతాయని వారు ప్రశ్నించారు. ఈ తరహా చర్యలను గ్రామస్థులు ఐక్యంగా ఎదుర్కుంటామన్నారు. దశాబ్దాల తరబడి న్యాయం కోసం ఎదురు చూస్తున్నా ఏ ప్రభుత్వం న్యాయం చేయలేదని ఆరోపించారు.


సొంత నిధులతో మట్టి రోడ్డు నిర్మాణం

కుకునూరుపల్లి, జూలై 7: ప్రభుత్వాలు, అధికారుల గురించి ఆలోచించకుండా రైతులే స్వయంగా మట్టి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. కుకునూరుపల్లి, మంగోల్ గ్రామాలకు చెందిన రైతులు వారి పొలాల వద్దకు వెళ్లే దారి సరిగా లేక ఇబ్బందులకు గురయ్యేవారు. వర్షాకాలంలో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంటుంది. రైతుల ఇబ్బందులను గమనించిన మంగోల్ మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి ఇరు గ్రామాల రైతులతో మాట్లాడి 30 ఫీట్ల మట్టి రోడ్డు నిర్మాణానికి ఒప్పించారు. దీనికి స్వచ్ఛందంగా రైతులు తమ భూములను రోడ్డు నిర్మాణానికి ఇచ్చారు. దాదాపు రెండు కిలోమీటర్ల వరకు రైతులు సొంత డబ్బులతో ఈ మట్టి రోడ్డును చేపట్టారు. భవిష్యత్తులో ఈ మట్టి రోడ్డు తారు రోడ్డుగా మార్చాలని ప్రభుత్వాన్ని రైతులు కోరారు.


సొంత నిధులతో మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టిన రైతులు

తెలంగాణలో సిద్దిపేట జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ఆదర్శంగా నిలిచింది. విద్యారంగంలో సైతం ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమై వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో ఒక్కో విధంగా ఉపాధ్యాయుల ఆలోచనకు పదును పెట్టి విద్యార్థులను చదువుల్లో అభివృద్ధి పరుస్తున్నారు. కొత్త కొత్త విషయాలను విద్యార్థులకు అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.
- కొండపాక, జూలై 7


సిద్దిపేట అర్బన్ మండలం నాంచార్‌పల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల



ఎస్సీఈఆర్టీ రూపొందించిన మ్యాగజైన్ ఫ్రంట్ పేజీ


నాంచార్ పల్లి పాఠశాల సక్సెస్ స్టోరీ

మ్యాగజైన్‌లో మన పాఠశాలలు

- 'హర్బింగర్స్ ఆఫ్ చేంజ్'లో పాఠశాలల విద్యారంగ కథనాలు
- సిద్దిపేట జిల్లాలోని నాలుగు పాఠశాలలకు చోటు

సిద్దిపేట జిల్లాకు చెందిన నాలుగు పాఠశాలల విజయగాథలను ఎస్సీఈఆర్టీ రూపొందించిన 2023-24 సంవత్సర 'హర్బింగర్స్ ఆఫ్ చేంజ్' అనే మ్యాగజైన్‌లో ప్రచురించారు. ప్రతిఏటా పుస్తకాన్ని ఎస్సీఈఆర్టీ రూపొందిస్తుంది. ప్రస్తుత సంవత్సరంలో రూపొందించిన మ్యాగజైన్‌లో 55 పాఠశాలలకు సంబంధించిన కథనాలను పొందుపరచగా.. ఇందులో సిద్దిపేట జిల్లాకు చెందిన నాలుగు పాఠశాలల కథనాలను పొందుపరచడం విశేషం. ఎస్సీఈఆర్టీ స్కూల్ లీడర్‌షిప్ అకాడమీకి చెందిన సురేష్‌బాబు నేతృత్వంలో మధుసూదన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వెంకటరమణమ్మల సహకారంతో ఈ మ్యాగజైన్ వెలువడింది. సిద్దిపేట అర్బన్ మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల నాంచార్‌పల్లి, చిన్నగుండవెల్లి ప్రాథమిక పాఠశాల, దుబ్బాక మండలం లచ్చపేట ప్రాథమిక పాఠశాల, దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్ ప్రాథమిక పాఠశాలలకు చెందిన విజయగాథలను ఇందులో ప్రచురించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది.. పాఠశాలలో అమలవుతున్న ప్రత్యేక కార్యక్రమాలతో పాటు.. విద్యార్థుల సంఖ్యను పెంచి పాఠశాల అభివృద్ధికి కృషిచేసిన ఉపాధ్యాయుల సక్సెస్ స్టోరీలను అందులో ప్రచురించారు. మ్యాగజైన్‌లో నాలుగు పాఠశాలలకు చెందిన కథనాలు రావడంతో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, సెక్టోరియల్ అధికారులు బేతి భాస్కర్, రామస్వామి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను అభినందించారు.

సమష్టి కృషి ఫలితం



పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా సమష్టి కృషి ఫలితంగా మ్యాగజైన్లో చోటు లభించడం ఆనందం. ఏ పనినైనా కలిసి చేస్తే అభివృద్ధి సాధిస్తామనేదానికి ఇది ఒక గుర్తింపు. ప్రైవేటుకు దీటుగా విద్యార్థుల సంఖ్యను పెంచాం. తల్లిదండ్రుల భాగస్వామ్యం, గ్రామస్థుల సహకారంతో పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచాం.

- చీల రవి, ఉపాధ్యాయుడు యూపీఎస్, నాంచార్‌పల్లి, సిద్దిపేట అర్బన్ మండలం

మ్యాగజైన్‌లో చోటు దక్కడం ఆనందంగా ఉంది



ఎస్సీఈఆర్టీ ప్రచురించిన సంచికలో తనకు చోటు లభించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. కష్టపడి పనిచేస్తే గుర్తింపు అదే వస్తది. పేద విద్యార్థులకు చదువు అందించడం, అంకితభావంతో పనిచేస్తే సమాజం గుర్తిస్తుంది.

- రాధాపద్మజ, ఉపాధ్యాయురాలు, చిన్న గుండవెల్లి, సిద్దిపేట రూరల్ మండలం

ఉపాధ్యాయుల కృషి ఫలితం

ఉపాధ్యాయుల కృషి ఫలితమే ఎస్సీఈఆర్టీ మ్యాగజైన్‌లో సక్సెస్ స్టోరీలు రావడం. వినూత్న పద్ధతుల్లో బోధన చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తయారు చేస్తున్న ఉపాధ్యాయుల అంకిత భావాన్ని గుర్తించడం, సిద్దిపేట జిల్లాలో నాలుగు పాఠశాలలకు చోటు లభించడం హర్షణీయం.

- బేతి భాస్కర్, జిల్లా సెక్టోరియల్ అధికారి

అటవీ భూమిని దున్నిన 15 మందిపై కేసు


శివ్వంపేట మండలం సీతారాంతండాలో గిరిజనులు చదును చేసిన అటవీ భూమి

శివ్వంపేట, జూలై 7 : అటవీ చట్టాన్ని ఉల్లంఘించి చెట్లను నరికి అక్రమంగా అటవీ భూమిని దున్నిన 15 మంది గిరిజనులపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి కిరణ్ తెలిపారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం సీతారాం తండాలో తూప్రాన్ రేంజ్ మంగల్‌పర్తి సెక్షన్ పరిధిలోని 318 కంపాట్‌మెంట్‌లో, నర్సాపూర్ రేంజ్ పరిధిలోని శివ్వంపేట సెక్షన్ 319 కంపాట్‌మెంట్‌లో నాలుగు రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా సుమారు నాలుగు హెక్టార్లలో చెట్లను నరికారు. అక్రమంగా సుమారు ఎకరా 20 గుంటల అటవీ భూమిని డోజర్‌లతో దున్ని చదును చేసారు. చట్టాన్ని ఉల్లంఘించిన సీతారాం తండాకు చెందిన మాలోత్ బద్రి, మాలోత్ పచ్య, మాలోత్ రమేష్, మాలోత్ కిషన్, కేతావత్ సామ్య, కాట్రోత్ దేష్య, కాట్రోత్ సాదు, కాట్రోత్ సరోజ, బుక్య హరిలాల్, మాలోత్ మంగ్య, మాలోత్ లక్ష్మి, మాలోత్ లాల్ సింగ్, మాలోత్ భాస్కర్, కాట్రోత్ శక్రు, మాలోత్ రవిపై అటవీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సెక్షన్ అధికారి కిరణ్ తెలిపారు.


గిరిజనులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారులు

'ఈడీ' పేరుతో బెదిరింపు

- బ్యాంకు వివరాలు అడిగి రూ.3 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

పటాన్‌చెరు, జూలై 7: 'నీపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదు అయింది. ఆధార్, బ్యాంకు వివరాలు చెప్పాలంటూ సైబర్ నేరగాళ్ల సరికొత్త ఎత్తుగడతో ఆన్‌లైన్ మోసానికి పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో చోటుచేసుకున్నది. బాధితుడు ఆదివారం పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అసలు మోసం వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని లక్డారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి జూలై 1న అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. తాను ముంబై ఈడీ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నానని నీపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదైందని బెదిరించాడు. ఆధార్, బ్యాంకు వివరాలు తెలపాలని దబాయించాడు. బాధితుడు భయభ్రాంతులకు గురై పూర్తి వివరాలను చెప్పాడు. ఫోన్‌కు వచ్చిన ఓటీపీ సైతం చెప్పడంతో ఖాతా నుంచి రూ.3లక్షలు మాయమయ్యాయి. రెండు రోజుల తరువాత బ్యాంకు వివరాలు తెలుసుకుని తాను మోసపోయానని గ్రహించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల పటాన్‌చెరు ప్రాంతంలో ఈడీ ఓ ప్రముఖ రాజకీయ నాయకుడి ఇంటిపై దాడి చేయడాన్ని గమనించి సైబర్ నేరగాళ్లు ఈ సరికొత్త ఎత్తుగడతో ఆన్‌లైన్ సైబర్ నేరానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

పర్యావరణవేత్త కిషన్‌రావుకు జాతీయ అవార్డు


అవార్డుతో డాక్టర్ కిషన్‌రావు దంపతులు

పటాన్‌చెరు, జూలై 7: నాలుగు దశాబ్దాలుగా పటాన్‌చెరు పారిశ్రామికవాడ కాలుష్యంపై పోరాడిన ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ అల్లాణి కిషన్‌రావు సేవలను కొనియాడుతూ క్యాపిటల్ ఫౌండేషన్ జాతీయ అవార్డును అందజేశారు. ఆదివారం శామీర్‌పేటలోని నల్సార్ విశ్వవిద్యాలయంలో దేశ అటార్నీ జనరల్ డాక్టర్.ఆర్.వెంకటరమణి, మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి నుంచి అవార్డును అందుకున్నారు. పటాన్‌చెరులో ఐదు దశాబ్దాలుగా వైద్యుడుగా సేవలందిస్తూ పర్యావరణ ఉద్యమకారుడుగా కాలుష్య నియంత్రణపై అనేక పోరాటాలు చేశారు. ఆయన పటాన్‌చెరు, ఐడీఏ బొల్లారం, సుల్తాన్‌పూర్ కాలుష్యంపై ఆయన రాసిన ఏ హెల్ ఆన్ ది ఎర్త్ పుస్తకం సంచలనం రేకెత్తించింది. రసాయన పరిశ్రమల కాలుష్యానికి నక్కవాగు పరివాహ ప్రాంతంలోని అనేక గ్రామాలలో భూగర్భ జలాలు కలుషిత కావడంపై సుప్రీంకోర్టును ఆశ్రయించి నష్టపరిహారం అందేలా కృషి చేశారు. ఆయన పోరాట ఫలితంగానే నక్కవాగుపై రసాయన ఉమ్మడి శుద్ధి కర్మాగారాన్ని ప్రభుత్వం నెలకొల్పింది. అవార్డు రావడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ పాలకుల ప్రథమ కర్తవ్యం కావాలన్నారు.


సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలో జగన్నాథ రథయాత్ర ఊరేగింపు ముందు కోలాటం ఆడుతున్న మహిళలు


జిన్నారం: పూరీ జగన్నాథస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న రథోత్సవంలో ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డిలో వైభవంగా జగన్నాథ రథయాత్ర

సంగారెడ్డి అర్బన్/జిన్నారం, జూలై 7: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) వారి ప్రచార కేంద్రం భక్తి యోగా సెంటర్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో జగన్నాథ రథయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. కొత్త బస్టాండ్ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు యాత్ర కొనసాగింది. అనంతరం పీఎస్ఆర్ గార్డెన్స్‌లో జగన్నాథ, బలదేవ సుభద్రలకు అలంకార సేవ, చప్పన్ భోగ నైవేద్య సమర్పణ, జగన్నాథ్ లీలలపై ప్రత్యేక ప్రవచనం, చిన్నారుల నృత్య ప్రదర్శనలు కనువిందుగా జరిగాయి. ఇస్కాన్ సీనియర్ భక్తులు శ్రీమాన్ ప్రేమ్‌నర్తన్ ప్రభుజీ మాట్లాడుతూ జగన్నాథస్వామి వైభవం, కలియుగంలో హరిహర సంకీర్తన ప్రాముఖ్యత, సంగారెడ్డిలో జరుగుతున్న భగవత్‌గీత ప్రచారం వంటి విశేషాలను వివరించారు. నట్‌కట్ గోపాల్ మేళా ప్రదర్శన ద్వారా చిన్న పిల్లలకు వినోదభరిత ఆటల పోటీలు నిర్వహించారు. ఈ రథయాత్రలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి పాల్గొని ఆశీర్వచనం పొందారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తి యోగా సెంటర్ కో ఆర్డినేటర్ గజేంద్రనాథ్, హలధర ప్రేమదాస్, ప్రేమ్ మహిమదాస్, నీతినిపుణ్‌దాస్, రాధాకృష్ణ, అరుణ్, సతీశ్, ప్రవీణ్, మురళికృష్ణ, కమల, శ్యామల, రామభద్రరూప, కౌన్సిలర్లు మంజులతానాగరాజుగౌడ్, లాడెమనీలా మల్లేశం, భక్తులు తదితరులు పాల్గొన్నారు. బొల్లారం మున్సిపాలిటీలోని పూరీ జగన్నాథస్వామి ఆలయం వద్ద రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయం వద్ద జగన్నాథస్వామి, సుభద్ర, బలరాములను రథోత్సవంలో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఒడిస్సా రాష్ట్ర వాసులు హాజరయ్యారు. ఒడిస్సా సంక్షేమ సంఘం, ఆలయ నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపారు.

సిద్దిపేటలో త్వరలో జాతీయ గర్ల్స్ ఫుట్‌బాల్ క్యాంప్

- ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ

సిద్దిపేట క్రైం, జూలై 7: సిద్దిపేటలో త్వరలో జాతీయ గర్ల్స్ ఫుట్‌బాల్ క్యాంప్‌ను నిర్వహిస్తామని ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ సభ్యులు, ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ అన్నారు. గోల్డెన్ బ్యాంక్విట్ హాల్‌లో సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం సిద్దిపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా, ముఖ్యఅతిథిగా ఫాల్గుణ హాజరయ్యారు. సిద్దిపేట జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాంగారి గణేష్, ప్రధాన కార్యదర్శిగా అక్బర్ నవాబ్, ఉపాధ్యక్షులుగా సుగుణకర్‌రెడ్డి, హరీశ్‌గౌడ్, నగేష్ జాయింట్ సెక్రటరీలుగా రాంగారి నర్సింహులు, ట్రెజరర్‌గా మాజిన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా లక్ష్మీనారాయణరెడ్డి, చక్రపాణిగౌడ్, సాజిద్‌పాషా, గోవర్ధన్‌రెడ్డి, అజర్‌పాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఫాల్గుణ మాట్లాడుతూ ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు వచ్చేలా కృషి చేయాలన్నారు. సిద్దిపేట జిల్లాలో అద్భుతమైన వసతులు ఉన్నాయని, వాటిని సరైన పద్ధతిలో వినియోగించుకుని ముందుకు వెళ్లాలని, అన్నివిధాలుగా మీకు అండగా ఉంటానని పేర్కొన్నారు. 15 నుంచి 29వ తేదీవరకు సిద్దిపేటలో జాతీయ జూనియర్ గర్ల్స్ ఫుట్‌బాల్ క్యాంప్ నిర్వహిస్తామని, ఇందులో ఎంపికైన క్రీడాకారులు కర్ణాటకలోని బెల్గావిలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట స్పోర్ట్స్ కన్వీనర్ పాల సాయిరాం పాల్గొన్నారు.


సిద్దిపేట జిల్లా ఫుట్‌బాల్ క్లబ్ కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఫాల్గుణ


శాకాంబరి రూపంలో వనదుర్గా మాత


ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

శాకాంబరి రూపంలో దుర్గామాత

- రకరకాల కూరగాయలతో అమ్మవారి అలంకరణ
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

పాపన్నపేట, జూలై 7: ఆషాఢమాసం మొదటి ఆదివారాన్ని పురస్కరించుకుని ఏడుపాయల వన దుర్గామాతను రకరకాల కూరగాయలతో శాకాంబరి రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామునే వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున ఏడుపాయలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి దుర్గామాతకు మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏడుపాయల ఆలయ ఛైర్మన్ సతెల్లి బాలాగౌడ్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఆలయ సిబ్బంది రవివీర్ కుమార్, సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింహులు, వరుణాచారి, బత్తిని రాజు, యాదగిరి, శ్రీకాంత్ ఏర్పాట్లు చేశారు. వేదపండితులు శంకరశర్మ, పార్థీవశర్మ, మురళీధర్, రాజశేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపన్నపేట ఎస్ఐ నరేష్ తగిన బందోబస్తు చేపట్టారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మిరుదొడ్డి, జూలై 7: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మిరుదొడ్డి మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం... మిరుదొడ్డి గ్రామానికి చెందిన ధర్మారం కనకయ్య(49)కు ఇద్దరు సంతానం. రెండు నెలల క్రితం కూతురు దీపిక వివాహం చేశాడు. పెళ్లయిన రెండు నెలలకే భర్తతో విభేదాల కారణంగా కూతురు విడాకులు తీసుకున్నది. దీంతో మనస్తాపానికి గురైన కనకయ్య ఎస్సీ హాస్టల్ వెనక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి...


చంద్రయ్య (ఫైల్)

మిరుదొడ్డి, జూలై 7:చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన సంఘటన మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్ఐ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రయ్య(68) గ్రామంలోని చెరువులో చేపల వేటకు వెళ్లాడు. వల వేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుకు చుట్టుకోవడంతో నీట మునిగి మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బందం చెరువులో మునిగి వృద్ధుడి మృతి

- వర్గల్ మండలం చౌదరిపల్లిలో ఘటన

వర్గల్, జూలై 7: ప్రమాదవశాత్తు వృద్ధుడు చెరువులో మునిగి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గౌరారం ఎస్ఐ శివకుమార్ వివరాల ప్రకారం.. వర్గల్ మండలం చౌదరిపల్లి గ్రామానికి చెందిన బండి సాయిలు(65)కు భార్య ముత్యాలు, కుమారుడు రమేష్ ఉన్నాడు. ఈనెల 4న రాత్రి కుటుంబసభ్యులంతా నిద్రపోయారు. మరుసటిరోజు ఉదయం చూసేసరికి సాయిలు కనిపించలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని బందం చెరువులో సాయిలు శవమై కనిపించాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడని మృతుడి కుమారుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం


ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

కొండపాక, జూలై 7: కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామంలోని 1061 సర్వే నంబర్‌లో 135 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇందులో కొంతమందికి ప్రభుత్వం భూమి పంపిణీ చేసింది. మిగతాది కబ్జాకు గురైంది. ఈ విషయాన్ని మాజీ ఎంపీటీసీ యాదగిరి అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన అధికారులు సర్వే చేయించి ప్రభుత్వ భూమిగా గుర్తించారు. సుమారు 35 ఎకరాల భూమి ఉన్నట్టుగా తేలడంతో స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేశారు. గ్రామ అవసరాల కోసం ఆ భూమిని ఉపయోగించుకోవడం కోసం గ్రామస్థులంతా కలిసి నిర్ణయించుకుంటామని యాదగిరి తెలిపాడు.

శ్రీరామాంజనేయ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో డీఎస్‌వో తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్, ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మర్కుక్, జూలై 7: మర్కుక్‌లోని శ్రీరామాంజనేయ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయ్, ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులోని రికార్డులను పరిశీలించి, స్టాక్ వివరాలను మిల్లు యజమాని బాలనారాయణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంగారెడ్డి డీఎస్‌వో వనజాత మాట్లాడుతూ ఈ మధ్య సివిల్ సప్లయ్ విషయంలో భారీగా అవకతవకలు జరుగుతుండడంతో సిద్దిపేట జిల్లాలోని మూడు ప్రధాన మిల్లుల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. స్టాక్, రికార్డు వివరాలు సరిగ్గానే ఉన్నాయని నిర్ధారించారు. వారితో ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ ఆరిఫా, ఆర్ఐ నర్సింహులు, మిల్లు నిర్వాహకుడు కృష్ణమూర్తి ఉన్నారు.


సంగారెడ్డిలోని కేకేభవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్

పంటలకు కేంద్రం మద్దతు ధర ఇవ్వాలి

సంగారెడ్డి రూరల్, జూలై 7: కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధ హామీని ఇస్తూ సమగ్ర ఉత్పత్తి ఖర్చు సీ2కు కనీసం 50 శాతం కలిపి మద్దతు ధరకు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లో మద్దతు ధరలు అమలయ్యే వ్యవస్థను ఇతర పంటలకు విస్తరించాలని అన్ని రాష్ట్రాల్లో మద్దతు ధరలను సేకరించి దేశంలో వ్యవసాయోత్పత్తుల మార్కెట్‌లను పెంచాలన్నారు. కౌలు రైతులు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చర్యలు తీసుకుని వారి హక్కులను గౌరవించేలా చూడాలన్నారు. భూమి లేని నిరుపేద, ఎస్సీ, ఎస్టీ రైతులకు భూమిని ఉచితంగా అందించాలని కోరారు. మహిళలకు కూడా భూమిపై హక్కులు ఉండేలా జాయింట్ పట్టాలను ఇవ్వాలని కోరారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర నాయకుడు జయరాజ్ మాట్లాడుతూ సాగు చేస్తున్న రైతులతో పాటు, కౌలు రైతులకు కూడా రైతు భరోసా అందించాలని, అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి రాజయ్య, ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రామాంజనేయులు, మాణిక్‌రెడ్డి, భూషన్, అంజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మునిపల్లి, జూలై 7: ప్రభుత్వ హాస్టల్‌లో నాణ్యమైన భోజనం అందించాలని తీన్మార్ మల్లన్న రాష్ట్రకమిటీ సభ్యుడు రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కంకల్ ప్రభుత్వ బాలురహాస్టల్‌ను సందర్శించి వంటశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఈ విషయంలో హాస్టల్ వార్డెన్‌లు నిర్లక్ష్యం చేస్తే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

అద్దె గదిలో అవస్థలు

కొత్త పంచాయతీ భవనం పూర్తయినా..

తలాపున సముద్రం ఉన్నా తాగేందుకు గుక్కెడు మంచి నీళ్లకు గతిలేని చందంగా మారింది కాళ్లకల్ మేజర్ గ్రామపంచాయతీ పరిస్థితి. దాదాపు రెండేళ్ల క్రితం గ్రామపంచాయతీ కార్యాలయ నూతన భవనం పనులు ప్రారంభించి, సుమారు 95 శాతం పూర్తయినా కాంట్రాక్టర్‌కు డబ్బు చెల్లించకపోవడంతో ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. దీంతో నేటికీ ఇరుకైన అద్దెగదిలో పాలన కొనసాగించాల్సిన దుస్థితి నెలకొన్నది. వివరాల్లోకి వెళ్తే..


కాళ్లకల్‌లో నూతనంగా నిర్మించిన భవనం, ప్రస్తుతం కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయ భవనం

మనోహరాబాద్, జూలై 7: మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన కాళ్లకల్ గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దాదాపు రెండేళ్ల క్రితం సుమారు రూ.65 లక్షల అంచనాతో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం భవన నిర్మాణం పనులను చేపట్టారు. కాంట్రాక్టర్ సుమారు 95శాతం పనులు చేశారు. గతంలో గ్రామపంచాయతీ భవనం పనులు పూర్తి అయ్యే వరకు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉంటూ పంచాయతీ పాలన కొనసాగించారు. దాంతో నూతన గ్రామ పంచాయతీ భవనం పనులు దాదాపు పూర్తి అయినప్పటికీ ఇంకా ప్రారంభించకపోవడంతో గ్రామస్థులు పంచాయతీకి సంబంధించి పత్రాలు, ఇతర పనుల కోసం పాఠశాలకు రావాల్సివస్తున్నది. ఇలా రోజూ ప్రజలు వస్తుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఉపాధ్యాయులు అంటున్నారు. వెంటనే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పాఠశాల నుంచి మరో చోటుకు మార్చాలని తెలిపారు. దీంతో మూడు నాలుగు రోజుల క్రితం కార్యదర్శులు, సిబ్బంది కలసి గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని పాలన కొనసాగిస్తున్నారు. పనులు పూర్తయినా కాంట్రాక్టర్‌కు డబ్బు చెల్లించనందునే నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఇంకా ప్రారంభించడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు.

నిధులు లేక కాంట్రాక్టర్‌కు చెల్లించలేదు


నత్తి మల్లేష్, మాజీ సర్పంచ్

కాళ్లకల్ మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. ఈ మేరకు.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనం కోసం రూ.25 లక్షల ప్రొసీడింగ్స్ అందినప్పటికీ, ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే రూ.25 లక్షలతో కలిపి మొత్తం రూ. 65 లక్షలు కాంట్రాక్టర్‌కు ఇవ్వాలని గ్రామ పంచాయతీ పాలక వర్గం ద్వారా తీర్మానించింది. ఇదే కాకుండా గ్రామంలో కాంట్రాక్టర్ ఇంకా ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి సుమారు రూ. 2 కోట్ల వరకు పనులు చేశాడు. సగం బిల్లులు చెల్లించినప్పటికీ, మిగతా బిల్లులు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో చెల్లించలేదని మాజీ సర్పంచ్ వివరించారు.

నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించాలి



లక్షల రూపాయలు వెచ్చించి గ్రామంలో నూతన గ్రామపంచాయతీని నిర్మించినా ఏమాత్రం ఫలితం లేదు. కాంట్రాక్టర్‌కు డబ్బు చెల్లించకపోవడంతో చిన్న చిన్న పనులు అలాగే వదిలేశాడు. దీంతో ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఇరుకైన అద్దె గదిలో కొనసాగిస్తున్నారు. సిబ్బంది విధుల నిర్వహణతో పాటు, పనుల కోసం వెళ్లే మా గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించాలి.

- సర్విన్‌గౌడ్, కాళ్లకల్ గ్రామస్థుడు

వాహనం ఢీకొని మహిళ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మురళి

టేక్మాల్, జూలై 7: టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బొడ్మాట్‌పల్లి గ్రామ శివారులోని 161 జాతీయ రహదారిపై ఆదివారం వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కడిలాబాయి తండాకు చెందిన లడికిబాయి(50) గ్రామంలో పనులు లేకపోవడంతో బొడ్మాట్‌పల్లి గ్రామానికి కూలీ పని కోసం వచ్చింది. రోడ్డు దాటుతున్న క్రమంలో టీఎస్ 07ఈక్యూ 7218 నంబర్ గల వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సమాచారం అందుకున్న ఎస్ఐ మురళి సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'మై ఆటో' స్టిక్కర్ తప్పనిసరి



ఆటోల డ్రైవర్లకు స్టిక్కర్లను వేసుకోవాలని చెబుతున్న పోలీసులు

జహీరాబాద్, జూలై 7: ఆటో డ్రైవర్లు తమ ఆటోలపై మై ఆటో స్టిక్కర్‌లను తప్పనిసరిగా వేసుకోవాలని జహీరాబాద్ పట్టణ సీఐ రాజబోయిన రవి పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంతోపాటు, మండలపరిధిలోని చిరాగ్‌పల్లి, కోహీర్, జహీరాబాద్ రూరల్ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి స్టిక్కర్ లేని 260 ఆటోలను గుర్తించామన్నారు. వాటన్నింటికి స్టిక్కర్లను వేసుకోవాలని ఆటో డ్రైవర్లను ఆదేశించినట్టు తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు లక్ష్మారెడ్డి, ప్రసాదరావు, నరేష్, క్రిష్ణ, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలి

రేగోడు జూలై 7: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం ఉందని రంజీ క్రికెట్ ప్లేయర్ నాగేంద్ర సూచించారు. జిల్లా అధికారుల అనుమతి మేరకు శనివారం రాత్రి రేగోడులోని రేషన్ దుకాణాన్ని, ప్రభుత్వ ఆసుపత్రిని, పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యం ప్రజలకు నాణ్యమైన ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, పోలీస్ స్టేషన్‌లో క్రైమ్స్ తీరు ఎలా ఉందంటూ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ ఫిరోజ్, జూనియర్ అసిస్టెంట్ రవి, పెద్ద శంకరంపేట రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శరణప్ప, ఏఎస్ఐ మల్లేశం తదితరులు ఉన్నారు.

పదవి లేకున్నా ప్రజల మధ్యే ఉంటా: మాజీ జడ్పీటీసీ


మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీలను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మునిపల్లి, జూలై 7: ఐదేళ్ల పాటు మండల ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేశానని, పదవీ ఉన్నా.. లేకున్నా.. ఇక ప్రజల మధ్యనే ఉంటానని మునిపల్లి తాజా మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ పేర్కొన్నారు. జడ్పీటీసీలు, ఎంపీటీసీల పదవీ కాలం ఇటీవల ముగిసిన సందర్భంగా ఆదివారం మండలంలోని ఖమ్మంపల్లి, పోల్కంపల్లి గ్రామాల శివారులో గల శ్రీ సాయిగార్డెన్‌లో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్‌తో పాటు ఎంపీటీసీలు మంద రాజశేఖర్, ఉల్లిగడ్డల శివకుమార్, స్వప్న, పిల్లోడి లక్ష్మిలను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ గత ఐదేళ్ల పాటు మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టి మండలాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులకు సహకరించిన మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పైతర సాయికుమార్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు గడ్డం బాస్కర్, గోపలారం మాజీ సర్పంచ్ కీర్తి కుమారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముప్పారంలో మూడు రోజులుగా తాగునీటి ఎద్దడి

అల్లాదుర్గం, జూలై 7 : మిషన్ భగీరథ తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని మండలంలోని ముప్పారం గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తమ గ్రామానికి కొన్నాళ్లుగా ఇష్టానుసారంగా భగీరథ నీటి సరఫరా చేస్తున్నారని, తాజాగా మూడు రోజుల నుంచి భగీరథ నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తిందని గ్రామస్థులు మండిపడుతున్నారు. భగీరథ నీటి సరఫరా పై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తుతుందని, ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా తమ గోడును పట్టించుకునేవారే లేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రామానికి నిలిచిపోయిన తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు మెదక్ నియోజకవర్గంలో రఘునందన్‌రావు పర్యటన

మెదక్ అర్బన్/నర్సాపూర్, జూలై 7: బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సోమవారం మెదక్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఏడుపాయల వనదుర్గామాత అమ్మవారిని దర్శించుకొనున్నారు. అక్కడి నుంచి 3 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో ఎంపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. అదేవిధంగా ఉదయం 11గంటలకు ఎంపీ రఘునందన్‌రావు నర్సాపూర్‌కు వస్తున్నందున స్థానిక సాయికృష్ణ గార్డెన్‌లో ఆత్మీయసభ ఏర్పాటు చేసినట్లు బీజేపీ నర్సాపూర్ నాయకులు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణంలో జాప్యంతో ధ్వంసమవుతున్న యూజీడీ


దొంతిలో ధ్వంసమైన యూజీడీ మ్యాన్ హోల్స్

శివ్వం పేట, జూలై 7: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తయి నెలలు గడుస్తున్నా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో నూతనంగా నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లు పూర్తిగా ధ్వంసం అవుతూ ప్రజాధనం వృధా అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ దొంతి గ్రామంలోని ఏడవ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయి ఎనిమిది నెలలు గడుస్తున్నా సీసీ రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో రోజు మ్యాన్ హోల్స్ పైనుంచి ట్రాక్టర్లు వెల్లడంతో అవి పూర్తిగా ధ్వంసం అయ్యాయని గ్రామస్థులు ఆరోపించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టిన వెంటనే సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పినా, నేటికీ సీసీ రోడ్డు నిర్మాణం చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా సీసీ రోడ్ నిర్మించాలని కోరుతున్నారు.

సదాశివపేటలో ఘనంగా జగ్గారెడ్డి జన్మదిన వేడుకలు


సదాశివపేటలో రక్తదాన కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి, పట్నం సుభాష్ తదితరులు


ఆసుపత్రిలో రోగుకులకు పండ్లు పంపిణీ చేస్తున్న మునిపల్లి సత్యనారాయణ, పిల్లోడి విశ్వనాథం

సదాశివపేట. జూలై 7: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఆయన కుమార్తె యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయారెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం సదాశివపేట పట్టణం, మండలంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పట్నం సుభాష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథం, మాజీ కౌన్సిలర్ రాయిపాడ్ రమేష్, యూత్ నాయకులు చిరు (చిరంజీవి), కోడూరి శరత్ చంద్రగుప్తాల ఆధ్వర్యంలో పట్టణం, మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేసి అన్నదానం నిర్వహించారు. వృద్ధులకు, అనాథలకు, దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. స్థానిక గాంధీ చౌక్ వద్ద నాయకులు పట్నం సుభాష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, జగ్గారెడ్డి అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తూర్పు నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేదలపాలిట దేవుడని కొనియాడారు. జగ్గారెడ్డి వల్లే సంగారెడ్డి నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రంలోనే టాప్ పొజిషన్‌లో ఉందన్నారు. అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం జగ్గారెడ్డి ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆడపిల్ల ప్రాముఖ్యతను సమాజం గుర్తించాలి

● జిల్లా సెషన్ కోర్టు న్యాయాధికారి లక్ష్మీశారద


కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయాధికారి లక్ష్మీ శారద

మాసాయిపేట, జూలై 7: సమాజంలో ఆడపిల్ల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గ్రహించాలని జిల్లా సెషన్ కోర్టు జడ్జి పి లక్ష్మీశారద పేర్కొన్నారు ఆదివారం మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి నడిమితండాలో కిమ్స్ కొడెన్స్ కొండాపూర్ ఆస్పత్రి డాక్టర్ శిల్పిరెడ్డి ఫౌండేషన్ గ్రో బిలియన్ ట్రీస్ స్వచ్ఛంద సంస్థతో కలిసి ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. గత ఆరు నెలలుగా ఆసుపత్రిలో జన్మించిన 250మంది ఆడపిల్లలకు గుర్తుగా నడిమి తండాలో డాక్టర్ సెల్పీరెడ్డితో కలిసి జిల్లా సెషన్ కోర్టు జడ్జి లక్ష్మీశారద 250 మామిడి మొక్కలను నాటారు ఈ సందర్భంగా తండాలోని మహిళలు గ్రామస్థులతో జిల్లా సెషన్ కోర్టు జడ్జి లక్ష్మీశారద మాట్లాడారు. మొక్కలు నాటే కార్యక్రమంలో జడ్జి లక్ష్మీశారద మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడ పిల్ల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గ్రహించాలని, వారి ఎదుగుదలకు అవసరమైన తోడ్పాటు అందించాలన్నారు. ఈ విషయంలో డాక్టర్ శిల్పిరెడ్డి ముందుకు వచ్చి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహకారం లభిస్తుందని, అందువల్ల ఆడపిల్లల ప్రాముఖ్యతను అందరూ గ్రహించాలన్నారు. కార్యక్రమంలో శిల్పిరెడ్డి మాట్లాడుతూ.. తాము ఈ కార్యక్రమం ద్వారా ఆడపిల్లల విద్య, సమాజంలో వారి విశిష్టతను తెలియజేస్తున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడానికి గ్రో బిలియన్ ట్రీస్ సంస్థ ద్వారా మారుమూల గ్రామంలో గిరిజనులను వివిధ గ్రామాల ప్రజలను చైతన్యం చేస్తూ తమ ఫౌండేషన్ ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఫౌండేషన్ ప్రతినిధులు నిధి రష్మిక తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ప్రత్యేక యాప్

మాసాయిపేట, జూలై 7: వినియోగదారుల సౌలభ్యం కోసం టీజీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చని, విద్యుత్ శాఖ ప్రత్యేక యాప్ విడుదల చేసిందని త్వరలో మార్గదర్శకాలు అందుతాయని మాసాయిపేట మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ మనోహర్ తెలిపారు. ఆదివారం మాసాయిపేటలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు చెల్లించడానికి విద్యుత్‌శాఖ టీజీఎస్పీడీసీఎల్‌లోని బిల్ డెస్క్ ద్వారా చెల్లింపులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి బిల్లు చెల్లింపులు చేయవచ్చని వినియోగదారుని పేరు, వివరాలు యాప్ ద్వారా వెంటనే లభ్యమవుతాయన్నారు. ఈ సదుపాయాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించవచ్చని ఆయన వినియోగదారులకు సూచించారు.

రోడ్లపై గుంతలను తవ్వినా పట్టించుకోరా?


జహీరాబాద్‌లో రోడ్లపై గోతులు తవ్వుతున్న దృశ్యం

జహీరాబాద్, జూలై 7: పట్టణంలో ప్రధాన రోడ్లు మినహా అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నాయి. రోడ్లను తవ్వాలంటే ముందస్తుగా సంబంధిత అధికారుల అనుమతులను తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. ఎప్పుడో తీసుకున్న కాలంచెల్లిన అనుమతి పత్రాలను చూయిస్తూ కొందరు కేబుల్ కాంట్రాక్టర్లు ప్రధాన, అంతర్గత రోడ్లను దర్జాగా తవ్వేయ్యడం, పైగా వాటిని సక్రమంగా పూడ్చకపోవడం మూలంగా ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద పెద్ద గోతులను తవ్వేసి వాటిని సక్రమంగ పూడ్చక అలాగే వదిలేయడంతో ఒక్కోసారి ప్రజలు, వాహన దారులు రోడ్లపై వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లపై అక్రమతవ్వకాలపై అధికారులు పట్టించుకోక పోవడంతో కేబుళ్లను వేసే కాంట్రాక్టర్లు ఎక్కడపడితే అక్కడ తవ్వడం పరిపాటిగా మారింది. అయితే సీసీ, బీటీ రోడ్లను తవ్వాలంటే ఓరేటు, మట్టి రోడ్లను తవ్వాలంటే ఇంకోరేటు చొప్పున సంబంధిత అధికారులు ధరలను నిర్ధారిస్తు అనుమతులు ఇస్తారు. అవన్నీ పక్కనబెట్టి ఎప్పుడో ఇచ్చిన అనుమతులను ఆసరా చేసుకుని కొందరు రోడ్లనైతే దర్జాగా తవ్వేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారుల నిర్లక్ష్యం ఫలితంగానే రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి రోడ్లను తవ్వకుండా చర్యలు చేపట్టాలని, తవ్విన గుంతలను సక్రమంగా పూడ్చేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

శేరిపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన

చేంగుంట, జూలై 7: నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో శనివారం రాత్రి సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్ఐ మోహియుద్దీన్ ఆధ్వర్యంలో కళాబృందంచే ప్రజలకు నేరాలు, మహిళల రక్షణపై పలు సూచనలు చేస్తూ, అవగాహన కల్పించారు. మహిళల అక్రమ రవాణ, బాల్య వివాహలు, బాలలపై దాడులు, అలాగే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

నేడు తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి

రామాయంపేట, జూలై 7: రామాయంపేట తహసీల్ కార్యాలయంలో ఇకపై ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ రజని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు.


ఆత్మీయ సమ్మేళనంలో అక్కన్న పేట హైస్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామాయంపేట, జూలై 7: అక్కన్నపేట హైస్కూల్‌లో పదోతరగతి 1996-97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం రామాయంపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఆత్మీయంగా పలకరించుకుంటూ పరస్పర క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు


మెదక్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

● మెదక్ కల్చరల్, జూలై 7: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. దీంతో పాటు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి మాట్లాడుతూ ఈనెల 22 నుంచి వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో షెడ్యూల్ కులాల రాజ్యాంగ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకై బిల్లు ఆమోదం తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలిశెట్టి రవి, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేష్ సీనియర్ నాయకులు ఉన్నారు.

● **కొల్చారం:** కొల్చారం మండల వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సంగాయిపేటలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్, కిష్టాపూర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అర్కెల ప్రవీణ్‌కుమార్ ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కిష్టాపూర్ మాజీ సర్పంచ్ గోదావరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్, సురేందర్, బాలయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

● **మాసాయిపేట:** మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు మాసాయిపేట యాదగిరి ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సిద్ధిరాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **చేగుంట:** మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలతో పాటు, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని బోనాల గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకన్న, జోగు మహేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

● **చిన్నశంకరంపేట:** మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు.

● **జహీరాబాద్:** మాదిగల అభ్యున్నతికి ఎమ్మార్పీఎస్ చేస్తున్న కృషి అమోఘమని ఎమ్మార్పీఎస్ జిల్లా, నియోజకవర్గ నాయకులు అబ్రహం మాదిగ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ జన్మదినం సందర్భంగ కేకును కట్‌చేసి పలువురికి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం, నాయకులు ప్రేందాస్, రాంచందర్, జయరాజు, స్వామిదాసు,వరాలు, మోజస్, శివకుమార్, రవీందర్, బండిమోహన్ పాల్గొన్నారు.


జహీరాబాద్‌లో పార్టీ జెండాను ఎగురవేసి, కేకును కట్‌చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

● **కోహీర్:** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చింతలగట్టు గ్రామంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు పార్టీ జెండా ఎగురవేసి, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ మాదిగలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో చింతలగట్టు మాజీ ఎంపీటీసీ మల్లన్న పాటిల్, నాయకులు ఉన్నారు.